డోంట్ కేర్



వాహనాల రాకపోకలతో రేగుతున్న దుమ్ము, ధూళి

రోడ్డు బాగోలేక ప్రమాదాలు జరుగుతున్నాయా..!
అయితే మాకేంటి.. అన్న రీతిలో వ్యవహరిస్తున్నారు... జాతీయ రహదారుల సంస్థ అధికారులు. అగనంపూడి టోల్ గేటు వద్ద జాతీయ రహదారి ఆధునికీకరణ పేరుతో ఉన్న రోడ్డు తవ్వేశారు. దీంతో ఆ మార్గం పిక్క తేలి అధ్వానంగా మారింది. ఫలితంగా ద్విచక్ర వాహనాలు అదుపుతప్పి గాయాలపాలవుతున్నారు. పది రోజుల్లో ఏకంగా 30 మందికి పైగా గాయపడ్డారంటే రోడ్డు దుస్థితికి అద్దంపడుతోంది.

- రోడ్డు తవ్వేసి వదిలేసిన వైనం
- ద్విచక్రవాహనాలు అదుపుతప్పి 30 మందికి పైగా గాయాలు
- రెండు కిలోమీటర్ల దూరం దుమ్ము, ధూళిలో ప్రయాణం
- చోద్యం చూస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు



ప్రమాదానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు (ఫైల్)

అగనంపూడి: అధికారుల నిర్లక్ష్యం ప్రయాణికులకు శాపంగా మారింది. జాతీయ రహదారి పునర్నిర్మాణం కోసం రోడ్డు తవ్వి వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. అసంపూర్తి పనులతో వాహనచోదకులు బెంబేలెత్తుతున్నారు. పది రోజుల నుంచి ఇదే దుస్థితి ఉన్నా అధికారులు స్పందించడం లేదు. కాంట్రాక్టర్ జాడ తెలియడం లేదు. దాదాపు రెండు కిలోమీటర్ల మేర రోడ్డు పిక్క తేలి ఉండడంతో వాహనాలు అదపుతప్పి బోల్తాపడుతున్నారు.పది రోజుల్లో 30 మందికి పైగా క్షతగాత్రులయ్యారు.

ఇదీ పరిస్థితి : జాతీయ రహదారి టోల్‌గేటు నుంచి అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు రెండుకిలోమీటర్ల మేర కొత్త లేయర్ వేయడానికి పనులు ప్రారంభించారు. దీని కోసం ప్రస్తుతం ఉన్న లేయర్‌ను తొలగించారు. బేబీ చిప్స్, 8ఎంఎం పిక్క వదిలేయడంతో రహదారిపై చెల్లాచెదురుగా పడి ఉంది. దీంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దుమ్ము రేగి కంట్లో పడడంతో ఇబ్బంది పడుతున్నారు. మరో వైపు రోడ్డంతా పిక్క తేలి ఉండడంతో వాహనాలు బోల్తా కొడుతున్నాయి. పడడంతో కాళ్లు, చేతుల దెబ్బలతో ఆస్పత్రిలో చికిత్స చేయించుకుంటున్నారు. సమీప ఇళ్లు, దుకాణాలపై దుమ్ము పడుతోంది. అయినా అధికారులు స్పందించక పోవడంపై వాహనచోదకులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అంతా ధూళిమయం

మరోపక్క భారీవాహనాల వల్ల దుమ్ము, ధూళి రేగుతోంది. ఫలితంగా ద్విచక్ర వాహనచోదకులతో పాటు పరిసర ప్రాంతాల వారు ఇబ్బందులు పడుతున్నారు. యంత్ర సామగ్రి టోల్‌ప్లాజా వద్దే సిద్ధంగా ఉన్నా పనులు మాత్రం ప్రారంభించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. జాతీయ రహదారిపై నిత్యం ప్రజల అవస్థలు చూస్తున్నా స్పందించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు.

నిర్లక్ష్యం తగదు



జాతీయ రహదారిపై దుమ్ము ధూళితో వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నా కనీసం స్పందించకపోవడం అన్యాయం. ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు తీరుతో స్థానికులతో పాటు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రోజూ వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నా చీమకుట్టినట్టు కూడా లేకపోవడం గమనార్హం.

– ఆర్.శ్రీనివాసరావు, కూర్మన్నపాలెం

ప్రజల ఇబ్బందులు పట్టవా?



జాతీయ రహదారి తవ్వేసి నిర్లక్ష్యంగా వదిలేశారు. యంత్ర సామగ్రి, మెటీరియల్ సిద్ధంగా ఉన్నా పనులు ఎందుకు చేయలేదో అర్థం కావడం లేదు. పిక్క తేలి ఉండడంతో రోజూ 10 నుంచి 15 మంది ద్విచక్రవాహనాలు అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు. జాతీయ రహదారి సంస్థ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలి.

– కె.భీష్మాచారి, అగనంపూడి

అగనంపూడి రోడ్డు పనులు పూర్తి చేయాలని ధర్నా



పనులు పూర్తి చేయాలని ధర్నా చేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు, నాయకులు

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారిపై టోల్ గేటు నుంచి జూనియర్ కళాశాల వరకు రోడ్డు తవ్వేసి వదిలేయడంపై వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రోడ్డు తవ్వేసి పది రోజులు అవుతున్నా పనులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పదుల సంఖ్యలో రోజూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం పనులు ప్రారంభించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బలిరెడ్డి సత్యనారాయణ, కరణం సత్యారావు, గంతకోరు అప్పారావు, మాడిశ వెంకటరావు, కరణం జగదీష్, సింగిడి సింహాచలం, డొక్కా రమేష్, గళ్ల హనీత, అంగులూరి ఈశ్వరరావు, కనకారావు పాల్గొన్నారు.

జొన్నకూటికి సేవారత్న పురస్కారం



జొన్నకూటి విజయ్‌కుమార్

అగనంపూడి: సామాజికవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు జొన్నకూటి విజయ్‌కుమార్ సేవారత్న పురస్కారం అందుకోనున్నారు. అంతర్జాతీయ సామాజికవేత్తల దినోత్సవాన్ని పురస్కరించుకొని వచ్చేనెల 7వ తేదీన పాన్ ఇండియా సోషియో కల్చరల్ అసోసియేషన్ ప్రతిష్టాత్మక సేవా రత్న పురస్కారాన్ని ప్రకటించింది. విజయ్‌కుమార్ 15 ఏళ్లుగా చేస్తున్న సేవలను గుర్తించి అవార్డు ప్రకటించారు.

క్లుప్తంగా

అంబేడ్కర్ చిత్రపటం ఆవిష్కరణ



అంబేడ్కర్ చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీవీవో కరుణరాజు

ఉక్కునగరం: డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ చిత్రపటాన్ని స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ (సీవీవో) డాక్టర్ ఎస్. కరుణరాజు ఆవిష్కరించారు. అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ (ఏసీటీ), ఏజేకే చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన అంబేడ్కర్ చిత్రపటాన్ని విడుదల చేశారు. అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఆళ్లమూడి ప్రభాకరరావు, ఏసీటీ విశాఖ కోఆర్డినేటర్ పి. భీమారావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



భక్తాంజనేయస్వామి ఆలయంలో దీపకాంతులు

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డు దయాల్‌నగర్ వద్ద భక్తాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని బుధవారం సాయంత్రం దీపారాధన చేశారు. ఆలయ అర్చకుడు కన్నేపల్లి సీతాపతిశర్మ ఆధ్వర్యంలో స్వస్తిక్, పద్మం తదితర ఆకారాల్లో భక్తాంజనేయుడిని దీపాలతో రూపుదిద్దారు. పెద్ద సంఖ్యలో భక్తులు దీపాలంకరణలో పాల్గొన్నారు. ముందుగా ఆంజనేయస్వామికి తమలపాకులు, సింధూరంతో పూజ చేశారు.

మాధ్యమిక పరీక్షలో మెరిసిన నడుపూరు విద్యార్థి



విద్యార్థిని ఆళ్ల తోషిణిని అభినందిస్తున్న హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్

పెదగంట్యాడ: దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన మాధ్యమిక పరీక్షలో నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఆళ్ల తోషిణి రెండో ర్యాంక్ సాధించింది. ఈ మేరకు పాఠశాలలో బుధవారం విద్యార్థినిని హెచ్‌ఎం రాచకొండ శ్రీనివాస్‌తో పాటు హిందీ విభాగం అధిపతి నారాయణరావు, ఉపాధ్యాయులు వరలక్ష్మి, శ్యామలావతి, శాంతకుమారి, సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మన్ పుష్పాంజలి అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ఎస్‌ఎస్‌లో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడ నుందని జోన్ – 2 ఈఈ బి.కె.నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అక్కిరెడ్డిపాలెం, నాతయ్యపాలెం, మింది, చిట్టినాయుడు కాలనీ, పంతులుగారి మేడ, బీహెచ్‌పీవీ టౌన్ షిప్, ఐయాన్ డిజిటల్ ఆన్‌లైన్ పరీక్షా కేంద్రం, రాంనగర్, నాతయ్యపాలెం వాటర్ వర్క్స్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పెదగంట్యాడ: టింపనీ 11కేవీ ఫీడర్, గాంధీనగర్ 11కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బీకే నాయకుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంధీనగర్ ఫీడర్ పరిధిలో సమతానగర్, చిననడుపూరు, పెదనడుపూరు, వెంపళ్ల నగర్, శీకువానిపాలెం, సిద్దేశ్వరం తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

బైపాస్ రహదారి నిర్మించాలని వినతి



ఎమ్మెల్యే రమేష్‌బాబుకు వినతిపత్రం అందిస్తున్న లంకెలపాలెం నాయకులు

అగనంపూడి: లంకెలపాలెం మీదుగా ఫార్మా బస్సులు, వాహనాలు, హిందూజా పవర్ ప్లాంట్‌కు బొగ్గు రవాణా చేస్తున్న భారీ వాహనాల వల్ల లంకెలపాలెం వాసులు కాలుష్యంతో సతమతమవుతున్నారని.. ఈ సమస్యకు చెక్ పెట్టేలా బైపాస్ రహదారి నిర్మించాలని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబును లంకెలపాలెం నాయకులు కోరారు. హిందూజా రోజూ వందలాది బొగ్గు లారీలు, ఫార్మాసిటీ బస్సులు, వాహనాల వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని వివరించారు. కాలుష్య సమస్యతో పాటు ట్రాఫిక్ ఇబ్బందులను గట్టెక్కించడానికి హోమీబాబా క్యాన్సర్ ఆస్పత్రి ఎదురుగా రైల్వే ట్రాక్‌ను ఆనుకొని ఏలేరు కాలువ పక్క నుంచి రహదారి నిర్మించాలని నాయకులు బొండా అప్పారావు మాస్టార్, అమరపిని జోగినాయుడు, నాగరాజు, మడక రమేష్ కోరారు.

స్టీల్ వైఎస్సార్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు సత్కారం



పుల్లారావును సత్కరిస్తున్న సీవీవో, నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వైఎస్సార్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి పుల్లారావును సత్కరించారు. వైఎస్సార్‌టీయూసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా బుధవారం ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. కరుణరాజు పుల్లారావుకు శాలువా కప్పి అభినందించారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య అధ్యక్షత వహించిన కార్యక్రమంలో నాయకులు బి.తౌడన్న, ఎస్. మోహన్‌బాబు, ఎస్. సత్యనారాయణ, రామకృష్ణ, ఫణీంద్రబాబు, కర్రి రత్నరాజు, కె.వి. సురేష్, సీహెచ్. వెంకటేశ్వరరావు, పి.రాజ్‌కుమార్, మోహన్, నాగరాజు, కోటి, చంద్రశేఖర్, ఉమాశంకర్ పాల్గొన్నారు.

కారు ఢీకొని కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



ప్రమాదస్థలంలో కాంట్రాక్ట్ కార్మికుడు ఉప్మాక

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ముందు కారు ఢీకొన్న ప్రమాదంలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నవి.. వడ్లపూడి యాదవ వీధికు చెందిన వియ్యపు ఉప్మాక (55) స్టీల్‌ప్లాంట్ ఈడీ (వర్క్స్) బిల్డింగ్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. యధావిధిగా బుధవారం ఉదయం విధులకు హాజరయ్యేందుకు ప్లాంట్ లోపలికి వచ్చిన ఉప్మాక ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ముందు రోడ్డు దాటుతుండగా అదే సమయంలో అటుగా వస్తున్న కారు అతన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో అతను తీవ్రంగా గాయపడగా వెంటనే అంబులెన్స్‌లో ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తీసుకువెళ్లారు. మెరుగైన చికిత్స కోసం అక్కడ నుంచి గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందాడు. ట్రాఫిక్ సీఐ వెంకటరావు సంఘటనా స్థలాన్ని సందర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

ఖోఖో క్రీడాకారిణి ఢిల్లీశ్వరికి సన్మానం



ఢిల్లీశ్వరిని అభినందిస్తున్న ఎంఈవో సునీత

అక్కిరెడ్డిపాలెం: 68వ రాష్ట్ర స్థాయి అండర్ 14 ఖోఖో పోటీల్లో విశాఖ జిల్లా జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హై స్కూల్ 8వ తరగతి విద్యార్థి ఆర్.ఢిల్లేశ్వరిని గాజువాక ఎంఈవో ఎం.సునీత బుధవారం అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ పీడీ మహ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనుల పరిశీలన



పనుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్ రాజు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియం ఆధునికీకరణ పనులను బుధవారం జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్ రాజు పరిశీలించారు. స్టేడియం అధ్వానంగా ఉండడంతో క్రీడాకారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో స్టేడియాన్ని ఆధునికీకరించేందుకు జీవీఎంసీ నిధులు కేటాయించింది. ఆ నిధులతో చేపట్టిన పనులు జోరుగా సాగుతున్నాయి. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే స్టేడియంతో పాటు స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొడ్డు నర్సింహపాత్రుడు, పల్లా శ్రీనివాసరావు, జోనల్ ఈఈ ఎంఆర్‌ఎస్ అప్పారావు, ఏఈ శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న దేవన్‌రెడ్డి తదితరులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు కాశీపాలెంలో గురుస్వామి పిన్నింటి సంతోష్ ఆధ్వర్యంలో అయ్యప్ప అంబలం పూజను వైభవంగా నిర్వహించారు.అయ్యప్ప ఆలయం సెట్ ఏర్పాటు చేసి అత్యంత వైభవంగా కార్యక్రమం చేపట్టారు. వందలాది మంది స్వాములు అయ్యప్పస్వామి భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గాజువాక ఎన్నికల పరిశీలకుడు తిప్పల దేవన్‌రెడ్డి, నాయకులు బొడ్డ గోవింద్, నాయకులు బొడ్డ సన్యాసిరావు, దుగ్గపు సూరిబాబు, వాసు, నరసింహమూర్తి, సత్యనారాయణ, అప్పిని సన్యాసిరావు, పూడి ఆనంద్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఎంఈవో రమణాజీ

పెదగంట్యాడ: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని.. ఎవరు ప్రోత్సహించినా చర్యలు తప్పవని ఎంఈవో కంకటాల రమణాజీ అన్నారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, ఆరోగ్య జాగ్రత్తలు అనే అంశంపై బుధవారం నెల్లిముక్కు అంగన్‌వాడీ కార్యకర్త వేణుశ్రీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు చిన్న వయసులో వివాహం చేయడం వల్ల మానసిక, శారీరక ఒత్తిడికి గురి కావడంతో పాటు ప్రసవ సమయంలో అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. వాతావరణానికి అనుగుణంగా ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అదానీ పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలి



ధర్నాలో మాట్లాడుతున్న జగ్గునాయుడు

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టును ప్రభుత్వం స్వాధీనం చేసుకొని విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు డిమాండ్ చేశారు. పెదగంట్యాడ జంక్షన్‌లో సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం ధర్నా చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదానీ పోర్టు బిల్డ్ ఆపరేటర్ ట్రాన్స్‌పోర్ట్ పద్ధతిలో నిర్మించారని ఆరోపించారు. దీని నిర్మాణం కోసం మూడు వేల ఎకరాలు తీసుకున్నారని వివరించారు. ఆ మూడు వేల ఎకరాలు వెయ్యి ఎకరాలు స్టీల్‌ప్లాంట్‌కు చెందినదేని చెప్పారు. గంగవరం పోర్టుతో రాష్ట్ర ప్రభుత్వం 2033 వరకూ చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధం అమలుకు ఎస్‌హెచ్‌జీలు సహకరించాలి



సమావేశంలో పాల్గొన్న ఎస్‌హెచ్‌జీ సభ్యులు



మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్ కుమార్

గాజువాక: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం అమలుకు స్వయం సహాయక సంఘాలు సహకరించాలని జీవీఎంసీ గాజువాక జోన్ సహాయ వైద్యాధికారి డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ కోరారు. ప్లాస్టిక్ నిషేధంపై ఎస్‌హెచ్‌జీలతో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాల మహిళలు నిత్యం ప్రజల్లోనే ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించాలని కోరారు. ప్లాస్టిక్ సంచులను ఉపయోగించడం వల్ల ఉత్పన్నమయ్యే సమస్యలను ప్రజలకు వివరించాలన్నారు. సరకుల కోసం దుకాణాలకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరూ గుడ్డ సంచులు తీసుకెళ్లే విధంగా అవగాహన కల్పించాలన్నారు. చెత్తను డోర్ డోర్ కలెక్షన్, క్లాప్ వాహనానికి ఇవ్వడంపై కూడా అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో యూసీడీ విభాగం సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ గంగాధర్, సీవోలు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్ కూడలిలో బస్సుల టైమింగ్ బోర్డు ఏర్పాటు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లి వచ్చే సిటీ బస్సుల వివరాలతో కూడిన బోర్డును ఏపీఎస్‌ఆర్టీసీ ఏర్పాటు చేసింది. దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి విశాఖ నగరంతో పాటు సింహాచలం, పెందుర్తి సిటీ బస్టేషన్ తదితర ప్రాంతాలకు 127 ట్రిప్‌ల సిటీ బస్సులను నడుపుతున్నారు. అయితే బస్సుల రాకపోకల వివరాలు అందుబాటులో లేకపోవడంతో ప్రయాణికులు అనేక మంది ఆటోలను ఆశ్రయిస్తున్నారు. రాజీవ్‌నగర్, రాసాలమ్మ కాలనీల నుంచి నిత్యం వేలాది మంది విద్యార్థులు, కార్మికులు, ఉద్యోగులు వివిధ పనుల మీద గాజువాక మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లి వస్తున్నారు. సిటీ బస్సుల రాకపోకల వివరాలు తెలియకపోవడంతో చాలా మంది ఆటోలను ఆశ్రయించడం లేదా కూర్మన్నపాలెంకూడలి వరకు ఆటోలో వెళ్లి వేరే బస్సులు ఎక్కుతున్నారు. వుడానగర్ ఫేజ్–1 అసోసియేషన్ ప్రతినిధులు విషయాన్ని ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో రాజీవ్‌నగర్ కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద రెండు వైపులా బోర్డులను ఆర్టీసీ ఏర్పాటు చేసింది.

పవర్ లిఫ్టింగ్‌లో ఉక్కు ఉద్యోగి సత్తా



మెడల్, ప్రశంసా పత్రంతో భాస్కరరావు

పెదగంట్యాడ: ఈ నెల 21 నుంచి 23 వరకూ పంజాబ్‌లోని రైతు బహర్ యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్–2024 పోటీల్లో ఉక్కు ఉద్యోగి మరల భాస్కరరావు సత్తా చాటారు. స్టీల్‌ప్లాంట్‌లోని డబ్ల్యూఎండీ వాటర్ మేనేజ్‌మెంట్ డిపార్టుమెంట్‌లో జనరల్ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్న భాస్కరరావు 83 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. అలాగే వచ్చే ఏడాది నిర్వహించనున్న అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. పతకం సాధించిన భాస్కరరావును విశాఖ నగర మాజీ మేయర్ పులుసు జనార్దరావు అభినందించారు.